

ఎంఎల్‌సి ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి : ఆర్‌డిఒ


నరసాపురం: ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలను సబ్ డివిజన్‌లో ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశామని ఆర్‌డిఒ దాసిరాజు చెప్పారు. మంగళవారం ఆయన సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఈనెల ఐదో తేదీ గురువారం జరిగే ఎన్నికలకు మొత్తం ఎనిమిది పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నరసాపురంలోని స్టీమర్ రోడ్డులో, పాలకొల్లులోని బిఆర్ఎస్ స్కూల్, ఆచంట, మొగల్తూరు, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు, యలమంచిలిలో మిగిలిన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సబ్ డివిజలో మొత్తం 1460 ఓట్లు ఉన్నాయన్నారు. అత్యధికంగా పాలకొల్లు బూత్‌ల్లో 480, నరసాపురంలో 425 ఓట్లు ఉండగా, ఆచంటలో అత్యల్పంగా 63, మొగల్తూరులో 88, పోడూరులో 71 ఓట్లు మాత్రమే ఉన్నాయన్నారు. ఎన్నికలకు మొత్తం 40 మంది సిబ్బంది నిర్వహిస్తారన్నారు. అదనంగా ఎనిమిది మంది పని చేస్తారన్నారు. బుధవారం సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అందిస్తామన్నారు.

విద్యుత్ బిల్లుల మోత..!

ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల బాదుడు
వైసిపి బాటలోనే కూటమి ప్రభుత్వం
డిసెంబర్ బిల్లులో రూ.150 నుంచి రూ.350 వరకూ పెరుగుదల
సామాన్య ప్రజానీకం విలవిల
జనవరి నుంచి మరో బాదుడుకు రంగం సిద్ధం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

విద్యుత్ బిల్లులు చూసి జనం షాక్‌కు గురవుతున్నారు. ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం జనంపై పెనుభారం మోపింది. గత నెల బిల్లుకంటే విద్యుత్ వాడకాన్ని బట్టి రూ.150 నుంచి రూ.350 వరకూ అదనంగా వచ్చిన పరిస్థితి ఉంది. డిసెంబర్ రెండో తేదీ నుంచి విద్యుత్‌శాఖ కరెంటు బిల్లులు తీస్తుంది. ఆ బిల్లులు చూసి సామాన్యులు హడలిపోతున్నారు. అప్పుడు వైసిపి.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తమపై విద్యుత్ భారాలు మోపుతూ వికట్టహాసం చేస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది వాడుకున్న విద్యుత్‌కు సంబంధించి ప్రభుత్వం ప్రజలపై ట్రూఅప్, సర్దుబాటు భారం మోపింది. డిసెంబర్‌లో ఇస్తున్న బిల్లుల నుంచి ఈ బాదుడు మొదలుపెట్టింది. జనవరిలో అదనంగా మరో ఛార్జీ మోతకు ఇప్పటికే అన్నీ సిద్ధం చేసింది. దీంతో జనానికి ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 12 లక్షల వరకూ గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో మూడొంతుల విద్యుత్ కనెక్షన్లు సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానివే. రెక్కాడితేగాని, డొక్కాడని కుటుంబాలు అనేకం ఉన్నాయి. విద్యుత్ బిల్లుల పేరుతో ప్రభుత్వాలు జనాన్ని పీక్కుతింటున్నాయి. వాడుకున్న కరెంటుకు కాకుండా ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ఇడి, సర్‌ఛార్జీ, ఇడి ఐఎన్‌టి, ఎఫ్‌పిపిసిఎ, ఎఫ్‌పిపిసిఎ2 ఛార్జీల పేరుతో వీర బాదుడు బాదుతోంది.


SCNO 1511066102071739
NAME SOMBA LOKARA
ADDR ZONE 5
CAT 1 PH 1
SCAT LT Domestic - Domestic
CONTRACTED LOAD 1.0KW
CONNECTED LOAD 1.0KW
MNO 6688242 MF 1.0
READING MONTH STS
PRES KWH 4625 02-12-2024 1
PREV KWH 4454 03-11-2024 1
AVG UNITS 166
BILLED UNITS 171
RMD 1.8KVA
ENERGY CHRG 832.51
FIXED CHRG 10.00
CUST CHRG 50.00
ED 10.26
SURCHARGES 0.00
ED INT 0.00
TRUEUP CHRG 0.00
FPPCA CHRG 347.27
FPPCA2 CHRG 64.00
SHORTFALL 0.00
ACD SURCHRG 0.00
FAN INSTAL 0.00
ADJ AMOUNT 0.00
LOSS/GAIN -0.04
BILL AMOUNT 1314.00
GOVT SUBSIDY 140.00
BILL AFT SUB 1174.00
ISD-TDS 0.00
ARREARS 0.00
BEF 01/04/24 0.01
1174.01
16-12-2024
01-01-2025

వాడుకున్న బిల్లు రూ.832
కాగా.. అదనపు ఛార్జీలు రూ.342
వచ్చిన బిల్లు

ఏలూరులోని ఓ మధ్యతరగతి కుటుంబం నవంబర్‌లో 171 యూనిట్లు కరెంటు వాడుకోగా రూ.832.51 వచ్చింది. వాడుకుంటున్న కరెంటుకు కాకుండా అదనపు ఛార్జీల కింద మరో రూ.342 వేయడంతో విద్యుత్ బిల్లు రూ.1,174 వచ్చింది. వచ్చిన కరెంటు బిల్లును మూడొంతులుగా విభజిస్తే అందులో ఒకవంతు అదనపు ఛార్జీల భారమే ఉండటంతో ఆ కుటుంబం లబోదిబోమంటుంది. వాడుకున్న కరెంటుకు, వస్తున్న బిల్లుకు సంబంధం లేకుండాపోయిందని వాపోతున్నారు. శీతాకాలంలో విద్యుత్ వాడకం తక్కువగా ఉంటుంది. ఇప్పుడు ఇంత పెద్దమొత్తంలో బిల్లు వస్తే వేసవిలో పరిస్థితి ఏమిటనే భయం అందరినీ వెంటాడుతోంది. చిరువ్యాపారులు సైతం కరెంటు బిల్లులు చూసి గుండెలు బాదుకుంటున్నారు. దీంతో ఆ భారాన్ని [illegible] జనాలపై పడవేస్తున్నారు. విద్యుత్ భారాల విషయంలో ప్రభుత్వం తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ ఛార్జీల పెంపుదలపై అప్పటి వైసిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన టిడిపి, బిజెపి, జనసేన, ఇప్పుడు కూటమి కింద అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత దారుణంగా వ్యవహరిస్తున్న పరిస్థితి కన్పిస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారంలోకి వచ్చాక మరోలా రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయనే చర్చ జనాల్లో సాగుతోంది.

ఆదాయాలు అంతంత మాత్రం.. ధరలు మాత్రం ఆకాశంలో..

సామాన్య ప్రజానీకం ఆదాయాల్లో మాత్రం పెరుగుదల ఉండటం లేదు. నిత్యావసర వస్తువుల నుంచి కూరగాయల ధరలు వరకూ అన్నింటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు సెంచరీ దాటేసిన పరిస్థితి ఉంది. కందిపప్పు, మినపప్పు వంటి ధరలు కిలో దాదాపు రూ.150 వరకూ పలుకుతున్నాయి. వంటనూనె కిలో రూ.140కుపైనే ఉంది. ఉల్లిపాయలు కిలో రూ.50కిపైనే పలుకుతోంది. ఇతర కూరగాయల ధరలు కిలో రూ.40 నుంచి రూ.80 వరకూ పెరిగిన పరిస్థితి ఉంది. మరోవైపు విద్యుత్ ఛార్జీల పెంపుతో సామాన్య ప్రజానీకం విలవిల్లాడుతోంది. పెను భారాలు మోపుతూ పాలకులు వ్యవహరిస్తున్న తీరుపై జనాగ్రహం పెల్లుబికుతోంది. వైసిపి ఓటమికి ప్రధాన కారణం తొమ్మిదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచడమే. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అదనపు ఛార్జీల పేరుతో రెండుసార్లు విద్యుత్ ఛార్జీల మోత మోగించింది. దీంతో కూటమి ప్రభుత్వంపై జనాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఒక్కసారిగా కరెంటు బిల్లు రూ.340 పెరిగింది

భానుమతి, ఏలూరు

గత నెల విద్యుత్ బిల్లుకంటే డిసెంబర్ రెండో తేదీన తీసిన విద్యుత్ బిల్లు రూ.342 ఎక్కువ వచ్చింది. ఒక్కసారిగా అంత పెరిగితే మధ్యతరగతి కుటుంబాలు ఏవిధంగా భరిస్తాయి. కరెంటు బిల్లు విషయంలో మాలాంటి మధ్యతరగతి కుటుంబాలు నలిగిపోతున్నాయి. ప్రభుత్వం అదనపు ఛార్జీలను ఉపసంహరించుకోవాలి.

అదనపు ఛార్జీలు భరించలేకపోతున్నాం

వరలక్ష్మి, ఏలూరు

వాడుకున్న కరెంటు కంటే అదనపు ఛార్జీల భారంతో నలిగిపోతున్నాం. అనేక ఛార్జీల పేరుతో భారం వేస్తున్నారు. గత నెల బిల్లుకంటే ఈ నెల బిల్లులో రూ.వంద వరకూ అదనపు ఛార్జీల భారం పడింది. అదనపు ఛార్జీలు భరించలేని స్థాయికి చేరాయి. ప్రభుత్వాలు మారినా భారాలు మాత్రం తగ్గలేదు. ఇలాగైతే సామాన్యులు ఎలా బతకాలో ప్రభుత్వమే చెప్పాలి.



వీరవాసరం తూర్పుచెరువు సెంటర్లో ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ట్రూఅప్ ఛార్జీల భారాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రజలపై వేసిన విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల భారాన్ని తక్షణం రద్దు చేయాలని సిపిఎం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విద్యుత్ సర్దుబాలు ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం తూర్పు చెరువు సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ బొర్రా అలమహారాజు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై రూ.9,412 కోట్ల భారాన్ని వేయడం దారుణమన్నారు. ఇప్పటికే అధిక ధరలు, ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న మధ్యతరగతి, పేద ప్రజలపై ట్రూఅప్ ఛార్జీల భారం వేయడం వారిని కుంగదీస్తోందన్నారు. స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలన్నారు. అదానీతో గత వైసిపి ప్రభుత్వం చేసుకున్న అవినీతి విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై భారాలు వేసే ప్రయత్నాలను విరమించుకోకపోతే భవిష్యత్‌లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ కార్యదర్శి పోతుల మృత్యుంజయ, నాయకులు యండమూరి సుబ్బారావు, లింగం సత్యనారాయణ, యాళ్లబండి నారాయణమూర్తి, మైగాపుల త్రిమూర్తులు, అయినంపూడి బాబూరావు, కిలాడి సత్యనారాయణ, చక్రవర్తి పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై..
ప్రభుత్వం తొండాట..!

మళ్లీ వాయిదా పడ్డ ఎన్నికలు
మొన్న అసెంబ్లీ, ఇప్పుడు తుపాను పేరుతో వాయిదా
ఎన్నికలు జరిపే ఉద్దేశం ఉందా అంటూ రైతుల్లో చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికలు మరోసారి వాయిదా పడ్డాయి. షెడ్యూల్ ప్రకటించిన తర్వాత రెండుసార్లు ఎన్నికలు వాయిదా పడటంపై రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. తొలుత నవంబర్ 21న సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 20వ తేదీ వరకూ ఎటువంటి ప్రకటనా చేయకుండా అప్పటికప్పుడు అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. అప్పటికే ఎన్నికలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. తర్వాత డిసెంబర్ ఐదో తేదీన సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అని, ఎనిమిదో తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మరో రెండు రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేయాల్సిన తరుణంలో తుపాను కారణంగా ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు మంగళవారం తెలిపింది. దీంతో గ్రామాల్లో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించే ఆలోచన ఉందా అంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల పేరుతో ప్రభుత్వం రైతులతో తొండాట ఆడుతోందని సర్వత్రా చర్చ సాగుతోంది. ఏలూరు జిల్లాలో మేజర్, మీడియం మైనర్ మొత్తం 354 వాటర్ యూజర్స్ అసోసియేషన్ల ప్రాదేశిక నియోజకవర్గాలను గుర్తించారు. ఈ పరిధిలో మొత్తం 2,31,311 మంది ఓటర్లు ఉన్నట్లు లెక్కలు తేల్చారు. వీటికి ఎన్నికలు నిర్వహించి 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, రెండు ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకోవాల్సి ఉంది. పశ్చిమలో మేజర్ 98, మైనర్ 14 మొత్తం 112 వాటర్ యూజర్స్ అసోసియేషన్ల ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు జరిపి 14 వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీకి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మొత్తం 3.29 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు లెక్కలు తేల్చారు. సాగునీటి సంఘాల ఎన్నికలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పైపులైన్ల మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - పెంటపాడు

పరిమెళ్ల సిపిడబ్ల్యూఎస్ పథకం పైపులైన్ల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని కె.పెంటపాడు, పరిమెళ్ల లాకులు నుంచి స్వచ్ఛమైన నీటిని ఎత్తిపోసే పంపింగ్ స్కీం పనితీరును కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా పరిశీలించారు. మండలాల వారీగా గ్రామాల్లోని ఎస్-ఎస్ ట్యాంకులకు తాగునీటి సరఫరా జరిగే ప్రాంతాలను మ్యాపుల్లో పరిశీలించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిమెళ్ల లాకులు నుంచి స్వచ్ఛమైన నీటిని ఎత్తిపోసేందుకు, గ్రామంలోని ఎస్ఎస్ ట్యాంకులకు కాలుష్య రహిత నీటిని అందజేసేందుకు పరిమెళ్ల వద్ద సిపిడబ్ల్యూఎస్ పథకాన్ని నిర్మించడం జరిగిందన్నారు. దీని ద్వారా గణపవరం, నిడమర్రు, ఆకివీడు, కాళ్ల మండలాల్లో 50 ఆవాసాల్లో 37 ఎస్ఎస్ ట్యాంకులను అనుసంధానం చేసేందుకు ఈ సిపిడబ్ల్యూఎస్ పథకం ప్రతిపాదించడం జరిగిందన్నారు. మొదటి దశలో కేటాయించిన నిధుల మేరకు మోటార్ల అమరిక, పైప్‌లైన్ నిర్మాణ పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. రెండో దశలో కేటాయించిన నిధుల వరకూ కొంతమేర పునులను పూర్తిచేయగా ఇంకా ఆకువీడు, కాళ్ల మండలాల్లోని 20 గ్రామ పంచాయతీల్లోని ఎస్ఎస్ ట్యాంకుల నీటి సరఫరాకు పనులను కొనసాగించాల్సి ఉందన్నారు. పూర్తి నిధులు సమకూరనందున పనులు ముందుకు సాగకపోవడం, ఇప్పటికే ఏర్పాటు చేసిన పైపులైన్లు, మోటార్లు మరమ్మతులకు గురయ్యాయని తెలిపారు. ప్రస్తుతం మరమ్మతుకు గురైన పైపులైన్ల పునరుద్ధరణకు జిల్లా పరిషత్ నిధులు రూ.61 లక్షలను ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ మేరకు టెండర్లను పిలవడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఉండి ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘు రామకృష్ణంరాజు పరిమెళ్ల వద్ద పైపులైన్ల పునరుద్ధరణ, మిగిలిన మండలాలకు విస్తరణ పనులపై పలుమార్లు తన వద్ద ప్రస్తావించారని కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలిపారు. వారి ప్రతిపాదనలకు అనుగుణంగా మూడో దశలో మిగిలిన గ్రామాలకు ఈ పథకాన్ని విస్తరించేందుకు వెంటనే ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నాగేశ్వరరావు, తహశీల్దార్ వై.శ్రీనివాస్, ఎంపిడిఒ సిహెచ్ బాలాజీ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇలు ఉన్నారు.


లాకులు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

హాస్టల్లో మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి

పరిమెళ్ల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులో తీసుకురావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ బాలుర హాస్టల్లో చేపట్టిన మరమ్మతు పనులను, టాయిలెట్లను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్లాబ్ మరమ్మతు పనులు త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. టాయిలెట్లకు, ఇతర పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. చిన్నచిన్న అవసరాలను దాతల ద్వారా సమకూర్చుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో కొంత సమయం ముచ్చటించారు. వండిన ఆహార పదార్థాలను రుచి చూశారు. కొంతమంది విద్యార్థులు బాక్సుల్లో అన్నం పెట్టించుకుని కొంచెం ఆహారం తినడాన్ని గమనించిన కలెక్టర్ వారిని మందలించారు. కలెక్టర్ వెంట తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కతీబ్ కౌసర్ భానో, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, వసతి గృహ సంక్షేమ అధికారి రామకృష్ణ, తహశీల్దార్ వై.శ్రీనివాస్ ఉన్నారు.

మద్దతు ధర రూ.1,600 ఇవ్వాలని ఆందోళన

ప్రజాశక్తి - ఆచంట

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇందుకూరి సూర్యనారాయణ రాజు అన్నారు. వల్లూరులో మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధాన్యం రాశులను పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధాన్యం రాశుల వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టే అవకాశం లేక అమ్మేందుకు సిద్ధపడితే, తేమశాతం 17 కంటే ఎక్కువ ఉందని కొనుగోలు కేంద్రాల దగ్గర సిబ్బంది రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని, తేమ 25 శాతం ఉన్నా ప్రతి గింజా కొంటామని పౌర సరఫరాల శాఖా మంత్రి చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయని విమర్శించారు. రైతు సేవా కేంద్రాల్లో 75 కేజీల బస్తాకు రూ.1,725 ఇస్తున్నానన్న ప్రభుత్వం ఇప్పుడు అదే బస్తాకు రూ.1,450 ఇచ్చి దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు ఎకరానికి రూ.10 నుంచి రూ.15 వేలు నష్టపోతున్నారని వాపోయారు. తేమ శాతం లేకుండా కనీసం మద్దతు ధర రూ.1,600 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, ప్రజా సంఘాల నాయకులు తోటపల్లి సత్యనారాయణ, బొర్రా ధర్మారావు, రైతులు బోళ్ల సుబ్బారావు, పులిదిండి బాబూరావు, అమలాపురం నాగేశ్వరరావు, లక్ష్మి, బోళ్ల సత్యనారాయణ, కండెల్ల సామ్యూల్, కడలి లోహిదాసు, కండెల నాగేశ్వరరావు పాల్గొన్నారు.


వల్లూరులో ధాన్యం రాశుల వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

గోపీమూర్తిని ఎంఎల్‌సిగా గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి - నిడమర్రు

ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తిని గెలిపించాలని మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. నిడమర్రు, పెదనింద్రకొలను, మందలపర్రు గ్రామాల్లో ఉపాధ్యాయులను ప్రజాసంఘాల నేతలు కలిసి కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు, యుటిఎఫ్ నాయకులు ఎస్‌కె.మౌలాలి మాట్లాడుతూ సిపిఎస్ రద్దు, పిఆర్‌సి అమలుకు నిరంతరం పోరాడిన వ్యక్తి గోపీమూర్తి అన్నారు. అటువంటి నేతను మండలికి పంపితే చట్టసభల్లో ఉపాధ్యాయుల గళం విన్పించే అవకాశం ఉంటుందని, అందువల్ల గోపీమూర్తిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు కోనా శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి గోపీమూర్తిని గెలిపించాలని యుటిఎఫ్ ఆధ్వర్యాన మంగళవారం మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. జీలుగుమిల్లి, మడకం వారిగూడెం, అంకన్నగూడెంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉపాధ్యాయులు తమ సమస్యలపై నిరంతరం పోరాడే వారిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉపాధ్యాయులంతా మొదటి ప్రాధాన్యతా ఓటు గోపీమూర్తికి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నారావు, భవానిశంకర్, సోమేశ్వరరావు, రమాదేవి, పోశమ్మ తదితరులు పాల్గొన్నారు.


జీలుగుమిల్లి : ప్రచారం చేస్తున్న నేతలు

ఎంఎల్‌సి, నీటి సంఘాల ఎన్నికలు
పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - గణపవరం

ఎంఎల్‌సి, నీటి సంఘాల ఎన్నికలను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అదికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌కు సంబంధించి ఎంఎల్‌సి ఎన్నికకు ఒక రూమ్, నీటి సంఘాల ఎంపికకు ఆరు రూమ్‌లు పరిశీలించారు. ఈనెల 5వ తేదీన నిర్వహించే ఎంఎల్‌సి ఎన్నికకు సంబంధించిన ఏర్పాట్లను ముందే పూర్తిచేసి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఓటింగ్ పూర్తిచేయాలన్నారు. అలాగే నీటి సంఘాల ఎంపికను నిబంధనల మేరకు పూర్తి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వైకెవి.అప్పారావు, ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీ లక్ష్మి, స్కూలు హెచ్‌ఎం ఎన్‌విఎస్.మూర్తి పాల్గొన్నారు.

బాలికల హాస్టల్లో కలెక్టర్ పరిశీలన

గణపవరం వెలమపేటలోని ఎస్‌సి బాలికల హాస్టల్లో జరుగుతున్న మరమ్మతు పనులను కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం పరిశీలించారు. వసతి గృహంలో నిర్మిస్తున్న టాయిలెట్‌ను పరిశీలించి ఇంజినీర్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం గదులను పరిశీలించి స్లాబ్ పెచ్చులు ఊడిన గదులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అప్పారావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.శోభారాణి, జిల్లా గృహ నిర్మాణ శాఖాధికారి జి.పిచ్చియ్య, ఎఇ కిరణ్ పాల్గొన్నారు.


హాస్టల్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉందని, ఈ నేపథ్యంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు ఆదేశించారు. శృంగవృక్షంలో రైతులు కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని భీమవరం వ్యవసాయ సహాయ సంచాలకులు బి.శ్రీనివాసరావు, పాలకోడేరు వ్యవసాయ అధికారి వి.నారాయణరావుతో కలిసి వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతానికి ధాన్యాన్ని అమ్ముకోవాలని తెలిపారు. ఎవరి దగ్గరా మోసపోకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యాన్ని తరలించాలన్నారు. ప్రస్తుతం వాతావరణం నిలకడగా ఉందని, రైతులు అధైర్య పడకుండా మాసూళ్లు వేగవంతం చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఎదురైతే రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోలు తీరు, ధాన్యం అమ్మకానికి సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వీరి వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ప్రచారానికి తెర

5న టీచర్స్ ఎంఎల్‌సి పోలింగ్
వ్యూహ ప్రతివ్యూహాల్లో అభ్యర్థులు
బరిలో పిడిఎఫ్ అభ్యర్థిగా గోపిమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక ప్రచారానికి మంగళవారం సాయంత్రం 5 గంటలతో తెర పడింది. ప్రచారం ముగియడంతో వ్యూహ ప్రతివ్యూహాల్లో అభ్యర్థులు ఉన్నారు. ఈనెల 5న పోలింగ్ జరుగనుంది. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహణకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గతంలో పిడిఎఫ్ ఎంఎల్‌సిగా ఉన్న షేక్ సాబ్జీ అకాల మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మొత్తం ఆరుగురు అభ్యర్థులు ఈ ఎన్నికల బరిలో నిలిచారు. సాబ్జీ స్థానంలో పిడిఎఫ్ అభ్యర్థిగా బొర్రా గోపిమూర్తి పోటీలో ఉన్నారు. మరో ఐదుగురు స్వతంత్రంగా పోటీ చేస్తున్నారు. వీరిలో రామచంద్రాపురం మండలం ద్రాక్షారామం గ్రామానికి చెందిన గంధం నారాయణరావుకు వైసిపి నేతలు కొందరు పరోక్షంగా మద్దతుగా ఉన్నారు. కూటమి సర్కారు ఈ ఎన్నికల్లో ఎవరికీ మద్దతు ఇవ్వడం లేదు.




6 నుంచి రెవెన్యూ సదస్సులు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఈనెల 6 నుంచి జనవరి 10వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగరాణి రెవెన్యూ అంశాలపై తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను జిల్లాలో జయప్రదంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పర్యటించాలన్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూములను తహశీల్దార్లు పున:పరిశీలన చేయాలని ఆదేశించారు. వారంలోగా దస్త్రాలన్నీ పరిశీలించి నివేదిక పంపాలన్నారు. బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంతో అధికారులు పనిచేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హెచ్‌పి గ్యాస్ డీలర్‌షిప్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - ఆకివీడు



షోరూంను ప్రారంభిస్తున్న డిజిఎం

రాష్ట్రంలోని 12 జిల్లాల్లో ప్రస్తుతం 38 లక్షల మంది హెచ్‌పి గ్యాస్ వినియోగదారులు ఉన్నారని ఆ సంస్థ డిజిఎం పత్తి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో మంజులాశౌల రెండవ హెచ్‌పి గ్యాస్ డీలర్ షిప్ కార్యాలయాన్ని సిద్ధాపురం రోడ్‌లో మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని 12 జిల్లాల్లో ప్రస్తుతం 27 మంది డీలర్లు ఉన్నారని, గతంలో ఉన్న వాటికి అదనంగా 42 మంది డీలర్లను నిర్మించామని ఆయన తలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో రాజమండ్రి, విశాఖపట్నం, రెండు చోట్ల నుంచి గ్యాస్ సరఫరా అవుతుందని ఆయన చెప్పారు. సిబ్బంది వినియోగదారులకు ఒద్దుతో, సహనంతో సమాధానం చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంభంపాటి కృష్ణమూర్తి, జిల్లా సేల్స్ ఆఫీసర్ ఎస్.ఎం.వెంకటేశ్వర్లు, పలువురు స్థానిక ప్రముఖులు, డీలర్లు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

గణపవరం : గణపవరం డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు మహిళా చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న రాష్ట్ర హైకోర్టు లాయర్లు ఎస్.వి.జిలానీ, షేక్ మహబూబా బాషా మాట్లాడుతూ మహిళల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహహింస చట్టం, పోక్సో చట్టం, చట్టాల వారి పరిధిలో వచ్చే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, లెక్చరర్లు కె.స్వరూపరాణి, టి.అక్కిరాజు, శ్రీనివాస్ రావు, జివి.శారదాదేవి పాల్గొన్నారు.

పాలకొల్లు : సృష్టికి మూలం స్త్రీ, ఆ స్త్రీ విద్యావంతురాలు అయితే ఆ కుటుంబం మొత్తం విద్యావంతులవుతారని సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ పి.శ్యాంసుందర్ వివరించారు. పాలకొల్లు ఎంఎంకెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిక విభాగం వారు తెలుగు, ఇంగ్లీష్, కంప్యూటర్ సైన్స్ వారి సహకారంతో నేషనల్ జెండర్ క్యాంపెయిన్ చేతన 3.0లో భాగంగా బాలికల విద్యపై అవగాహన కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజారాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ పి.శ్యాంసుందర్ మాట్లాడుతూ ఆడపిల్లలను సమాజంలో చదువుకోవడానికి ప్రోత్సాహాన్ని, పౌష్టికాహారాన్ని తల్లిదండ్రులు అందించాలని కోరారు. ఐక్యు ఎసి కోఆర్డినేటర్ భద్రాచలం, ఆంగ్ల విభాగాధిపతి ఎన్ఎస్ఎస్ దినకర్ పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ విజేతలకు అభినందన

నరసాపురం : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 1, 2వ తేదీలలో జరిగిన జెఎన్‌టియు కాకినాడ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ మహిళల విభాగంలో స్వర్ణాంధ్ర కాలేజీ విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించినట్లు కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ తెలిపారు. స్వర్ణాంధ్ర కాలేజీ విద్యార్థిని డి.సునీత(ఎంబిఎ మొదటి సంవత్సరం) జెఎన్‌టియుకె టేబుల్ టెన్నిస్ జట్టుకి ఎంపిక అయ్యింది. ఈ విద్యార్థిని జనవరి 3 వ తేదీ నుంచి 5వ తేదీలలో అమిటీ యూనివర్శిటీ, చెన్నైలో జరిగే సౌత్ జోన్ పోటీలలో జెఎన్‌టియుకె తరపున పాల్గొంటారన్నారు. ఈ విద్యార్థినులను కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి త్రినాథ్, డైరెక్టర్ అద్దాల శ్రీహరి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సురేష్ కుమార్ అభినందించారు.

'కూటమి హయాంలో రాష్ట్రం అప్పుల పాలు'

తాడేపల్లిగూడెం : కూటమి ప్రభుత్వం అప్పు చేసిన రూ.67 వేల కోట్లు ఏ పథకాలకు ఖర్చు పెట్టారని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లిగూడెం వైసిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఎవరితో మాట్లాడిన ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని అంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిందన్నారు. రాష్ట్రంలో లిక్కర్ మాఫియా, ఇసుక మాఫియా నడుస్తుందన్నారు. మొన్నటి వరకు అమరావతి, తిరుపతి లడ్డు, పోలవరం పేరుతో డైవర్షన్ పాలిటిక్స్ చేశారు. ఇప్పుడు కొత్తగా సీజ్ ది షిప్ అని మొదలుపెట్టారన్నారు. నిజాలన్నీ ప్రజలకు త్వరలోనే తెలుస్తాయన్నారు. ముప్పిడి సంపత్ కుమార్, కర్రి భాస్కరరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : ఎస్‌పి

ఆచంట : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ అన్నారు. మంగళవారం ఆచంట పోలీస్ స్టేషన్‌లో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్షిక తనిఖీలో భాగంగా ఆచంట పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాల నివారణకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామని, గతంలో నమోదైన కేసులపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసాపురం డిఎస్‌పి శ్రీదేవి, పెనుగొండ సిఐ రాయుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కాళ్ల : జక్కరం గ్రామం చినపేటలో సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో యూత్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జక్కరం పేరిష్ పాస్టర్ జిబి కరుణాకర్ ఉపదేశించారు. యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు అంశాలు అందరినీ ఆకర్షించాయి. ఈ వేడుకల్లో సంఘపెద్దలు ఎస్.స్వాక్, బి.మోషేన్, ఎస్.రవి, బి.ఇస్సాక్, స్త్రీల సమాజం, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆచంట : మండలంలోని వల్లూరు యుబిఎం పాస్టర్స్ ఫెలోషిప్ 18వ వార్షిక ఐక్య క్రిస్మస్ ఆరాధన సోమవారం వల్లూరు మరనాత దేవాలయంలో జి.లాజరస్ ప్రెసిడెంట్, సిహెచ్.విలియమ్స్ జాషువా ఆధ్వర్యంలో జరిగింది. రెవ జె.జోతికుమార్ క్రిస్మస్ సందేశం ద్వారా సేవకులు క్రీస్తు ప్రేమను తెలియజేయాలని, దేశనాయకులు ప్రజల క్షేమంకు ప్రార్థించాలని సందేశమిచ్చారు. ఈ ఐక్య క్రిస్మస్‌లో కమిటీ సభ్యులు ఇపిఎం పాస్టర్లు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కారు ఢీకొని వ్యక్తి మృతి

పెనుగొండ : కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానికంగా చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి దొడ్డి నాగరాజు(39)ను కారు ఢీకొట్టడంతో తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. పెనుగొండ ఎస్ఐ గంగాధర్ రావు సంఘటనా స్థలం పరిశీలించి దగ్గులూరు గ్రామానికి చెందిన దొడ్డి నాగరాజు తన స్వగ్రామం నుంచి రాజమండ్రి బయలుదేరి వెళ్తుండగా మార్గమధ్యలో పెనుగొండ వచ్చేసరికి ఎదురుగా కారు అతివేగంగా ఢీకొట్టడంతో నాగరాజు మృతిచెందారు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగరాజు రాజమండ్రిలో లక్ష్మీ శ్రీనివాస రైస్ మిల్‌లో లారీ డ్రైవర్ పనిచేస్తున్నారు. ఎస్ఐ కె.గంగాధర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

6 మద్యం సీసాలు స్వాధీనం

పాలకొల్లు : పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన దాడులలో మండలంలోని వాలమర్రులో ఎ.సత్యనారాయణ అను వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 6 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ మద్దాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐ పి.మహేష్, జి.రఘు పాల్గొన్నారని తెలిపారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముగ్గురు దొంగలు అరెస్ట్

సెల్ ఫోన్ స్వాధీనం, బైక్ సీజ్

నరసాపురం : రహదారులపై దారి దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసినట్లు నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గా ప్రసాద్ తెలిపారు. మంగళవారం సిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు 19వ తేదీన రాత్రి మొగల్తూరు మండలం జగన్నాథపురంకు చెందిన ఎం.దుర్గారావు పాలకొల్లు వెళ్తు సీతారామపురం టోల్ గేట్ సమీపంలో మూత్ర విసర్జనకు ఆగాడన్నారు. ఆ సమయంలో అక్కడ దాగి ఉన్న ఒక ట్రాన్స్‌జెండర్, ఇద్దరు వ్యక్తులు దుర్గారావుపై దాడి చేసి రూ.22 వేల నగదు, ఫోన్ లాక్కొని పారిపోయారన్నారు. దీనిపై బాధితుడు దుర్గారావు మొగల్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ముద్దాయిలు కేశవరపు వీర వెంకట సత్య విష్ణుష్, రాయుడు రాజు, తలపల అశోక్(హిజ్రా)ను అరెస్టు చేశారు. వీరివద్ద నుంచి సెల్ ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు. ఈ సమావేశంలో మొగల్తూరు ఎస్ఐ జి.వాసు, వై.నాగలక్ష్మి, ఎఎస్ఐ సిహెచ్.సత్యనారాయణ, కానిస్టేబుల్ రాజేష్, బేబీ పాల్గొన్నారు.

కిశోరి వికాసం సమర్థవంతంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - పాలకోడేరు



పాలకోడేరు : మాట్లాడుతున్న సిడిపిఒ వాణి విజయరత్నం


ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కిశోరి వికాసం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆకివీడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ వాణి విజయరత్నం అన్నారు. పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీలకు, ఎఎన్ఎంలకు, మహిళా పోలీసులకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు, ఉపాధ్యాయులు, ఆధ్యాపకులకు కిశోరి వికాసంపై మండల స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టిఒటిసిలు, ఎంపిడిఒ వి.రెడ్డియా, గరగపర్రు ఉపాధ్యాయులు సునీత, అడ్వకేట్ విజ్ఞాన దేవి, పాలకోడేరు పిహెచ్‌సి వైద్యాధికారి స్వర్ణ నిరంజన్‌లు వివిధ అంశాలపై గ్రామస్థాయి అధికారులకు, ఉపాధ్యాయులకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ శిక్షణ అందజేశారు. ముఖ్యంగా 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసు ఉన్న ఆడపిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టాలు, బాల్య వివాహాలు, సమాజంలో మెలుకువలు, సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యం వంటి అంశాలపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆకివీడు సిడిపిఒ వాణి విజయ రత్నం మాట్లాడుతూ కిశోరి వికాస కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గ్రామస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశంపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా బాలబాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించడంతోపాటు వాటిని ఏవిధంగా పరిష్కరించుకోవాలో సూచనలు, సలహాలు కూడా అందించాలన్నారు. బాల్య వివాహాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు చేసుకుంటే వచ్చే అనర్థాలను వివరించడంతోపాటు వాటిని ప్రోత్సహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చాటి చెప్పాలన్నారు. మరీ ముఖ్యంగా చట్టాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎంవిఎస్.ప్రసాద్, అంగన్వాడీ సూపర్వైజర్లు పార్వతి, సూర్య కుమారి పాల్గొన్నారు.

గణపవరం : మండలంలో బాలికా వికాసంపై అవగాహనా సమావేశం మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఐదుగురుతో కమిటీ ఏర్పాటు చేసుకొని చదువు మధ్యలో ఆపివేసిన 11 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలను గుర్తించి, వారితో గ్రూపు ఏర్పాటు చేయాలని అన్నారు. వారితో ప్రతి నెలా 2, 4 శనివారాల్లో స్థానిక అంగన్వాడీ కేంద్రాల వద్ద సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. వారికి పరిశుభ్రత, బాల్యవివాహాలు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశం మినిట్స్ బుక్ ఎంపిడిఒ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. మినిట్స్ అందజేయకపోతే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాదికారి ఎం.బాలయ్య, సిహెచ్ఒ విల్సన్ బాబు, ఐసిడిఎస్ సూపర్ వైజర్ పి.తులసి, జి.చంద్రావతి, సిహెచ్.దుర్గాభవాని పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : 11 నుంచి 18 సంవత్సరాల వయసుగల బాలబాలికలకు చట్టాలపై అవగాహన కల్పించాలని ఐసిడిఎస్ సిడిపిఒ డి.ఇందిర తెలిపారు. పాలకొల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రూరల్, అర్బన్ స్థాయిలో కిశోరి వికాసం కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ ఇందిర మాట్లాడుతూ స్కూలుకు వెళ్లని బాలబాలికలను గుర్తించాలన్నారు. ఎంపిడిఒ ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి శిక్షణా కార్యక్రమాల ద్వారా సమిష్టి కృషితో విద్యార్థులకు మంచి అవగాహన కల్పించవచ్చు అన్నారు. ఇఒపిఆర్‌డి టి.మూర్తి బాబు మాట్లాడుతూ విద్య, సంపూర్ణ ఆరోగ్యం, పౌష్టికాహారం, మానవుల ప్రాముఖ్యత, బాల్యవివాహాల నిరోధం, బాలికల అక్రమ రవాణా, ఆత్మరక్షణ, పోక్సో చట్టాలపై అవగాహన, మానసిక వికాసం, స్కిల్స్ డెవలప్మెంట్, యోగ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - నరసాపురం



నరసాపురం : ఆర్థికసహాయం అందిస్తున్న శ్రీనివాస్

వికలాంగుల్లో ఆత్మస్థైర్యం, మనోధైర్యం నింపేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ అన్నారు. వలందరరేవులో నిర్వహించిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కొప్పర్రు జనసేన నాయకులు వికలాంగుల సంక్షేమానికి తనవంతు సాయంగా రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం వివిధ రకాల పోటీలు నిర్వహించి, వారికి బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగ మహాసంఘటన్ జాతీయ అధ్యక్షులు నందూరి రమేష్, బొమ్మిడి సునీత, విసి కొత్తపల్లి నాని, అప్పారావు, చిక్కాల వాసు, రాబర్ట్, పి.బాలు, కె.నాగరాజు, కె.రాంబాబు, సూర్యనారాయణ పాల్గొన్నారు

పట్టణంలోని శ్రీహరి పేట స్పెషల్ మున్సిపల్ యూపి స్కూల్లో భవిత విలీన విద్య వనరుల కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండల విద్యాధికారి జాన్ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు చల్లా దానయ్య నాయుడు పాల్గొని మాట్లాడారు. వికలాంగులను గౌరవించాలన్నారు. వారికి విద్య బోధించడం ఎంతో కష్టతరం అయినప్పటికీ శిక్షణ ఇచ్చే వారు ఓర్పు, సహనం కలిగి ఉండడం, తల్లిదండ్రులు కంటికి రెప్పలా చూసుకోవడం ఎంతో అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఒకటో వార్డు కౌన్సిలర్ సోమరాజు, భవాని పాల్గొన్నారు. న్యాయ సేవా సంస్థ తరపున వైడి.ఫణికర్ ఫ్రూట్స్, బిస్కెట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు ఎం.విజయ్ కుమార్, ఎం.ప్రభాకరరావు, ప్రధానోపాధ్యాయుడు దేవ రమేష్, భవిత నిర్వాహకులు శారద, రాధా పాల్గొన్నారు.

వికలాంగులు సదరం సర్టిఫికేట్ కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారంటూ మంగళవారం అధికారులకు తల్లితండ్రులు విన్నవించారు. పట్టణంలోని శ్రీహరిపేటలో భవిత వీలిన విద్య వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవానికి జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్యాంసుందర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. సర్టిఫికేట్లు త్వరితగతిన రాకపోవడం వల్ల ప్రభుత్వం అందించే పింఛన్‌ను తీసుకోలేకపోతున్నామన్నారు. సదరం క్యాంపులు ఏర్పాటు చేసి, వికలాంగులకు మేలు చేయాలని తల్లితండ్రులు విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన త్వరలో అన్ని చోట్ల క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం వికలాంగులకు అందించే పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగపర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులందించారు. ఈకార్యక్రమంలో ఎంఇఒ జాన్ ప్రభాకర్, కౌన్సిలర్ దుర్గాభవాని, ఉపాధ్యాయులు డి.రాంబాబు, కె.శారదలు, రాధ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : వికలాంగ పిల్లల్లో లోపాన్ని చూడవద్దని, వారి ప్రతిభను గుర్తించి శిక్షణ ఇచ్చినట్లయితే అద్భుతాలు సృష్టిస్తారని డైమండ్ లయన్స్ ఛైర్మన్ జిల్లా జిఎంఎ కోఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు తెలిపారు. స్థానిక సుబ్బారావు పేట వికలాంగుల పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తాడేపల్లిగూడెం మండల విద్యాశాఖ అధికారి వి.హనుమ మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగ పిల్లల సంరక్షణకు వివిధ చట్టాలు, ఉద్యోగాల్లోనూ, పరీక్షల్లోనూ రాయితీలు కల్పించిందని, వికలాంగ పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని పిల్లలను చదివించాలని తెలిపారు. అనంతరం పిల్లలచే కేక్ కట్ చేయించి కేకు, డ్రింక్స్, బహుమతులు, సర్టిఫికెట్స్, డ్రాయింగ్ బుక్స్, బిస్కెట్స్, పెన్సిల్స్, నోట్ బుక్స్, పలకలు అందజేశారు. భవిత కేంద్రంలో వికలాంగ పిల్లలకు సేవలందిస్తున్న బి.నాగలక్ష్మిని శాలువాతో సన్మానించారు. లయన్స్ నార్ని వెంకట కృష్ణారావు, చిన్ని, లయన్స్ చెన్నా రెడ్డి, సతీష్ విద్యార్థులకు, తల్లిదండ్రులకు మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దంత వైద్యులు డాక్టర్ లయన్స్ భాను సత్యనారాయణ, లయన్స్ సాయిరాం, లయన్స్ మామిడి శెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆచంట : వికలాంగ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఓర్పు, సహనంతో పాఠాలు బోధించాలని ఎంఇఒ 1, 2లు ఎ.ఉషారాణి, టి.రాజేంద్రప్రసాద్‌లు అన్నారు. ఆచంట ఎంపిపిఎస్ బాయ్స్ స్కూల్ ఆచంటలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఇఒ-1 ఎ.ఉషారాణి, ఎంఇఒ-2 టి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ వికలాంగ పిల్లలను ప్రేమతో లాలిస్తూ, వారిని మామూలు పిల్లల్లాగే చూడాలని, వారిలో ఉన్న నైపుణ్యాలను గ్రహించి తగిన తర్ఫీదు ఇస్తే వారు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని తెలిపారు. అనంతరం ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన పిల్లలకు బహుమతులు ప్రధానం చేశారు. ఎంపిపిఎస్ బాయ్స్ స్కూల్ హెచ్‌ఎం సిహెచ్.బాలయ్య, ఐఇడి టీచర్లు కె.దానేశ్వరరావు, కె.నాగమణి పాల్గొన్నారు.

ఉండి: వికలాంగుల పట్ల జాలి చూపించడం కాదని, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.శేషయ్య అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ సభలో ముఖ్య అతిథిగా మండల తహశీల్దార్ కావడి నాగార్జున పాల్గొని మాట్లాడుతూ వికలాంగులు తమ వైకల్యాన్ని ఓడించి, సాధించిన విజయాలు ఇతరులకు స్ఫూర్తినిస్తున్నాయన్నారు. మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపిడిఒ ఎస్.రవీంద్ర మాట్లాడుతూ వికలాంగులను ప్రోత్సహిస్తే సాధించలేనిది లేదన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ ప్రతి ఏటా విద్యార్థులకు క్రీడలు నిర్వహించి, లయన్స్ క్లబ్ తరపున బహుమతులు అందజేస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కునుకు రమాదేవి శ్రీనివాస్, క్లబ్ ఉపాధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు, ఉపాధ్యాయులు మధుసూదన్, తబిత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకివీడు : అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్‌పి హైస్కూల్లో ఆటల పోటీలు నిర్వహించి, వారిలో గెలిచిన వారికి, పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఎన్.పోతు రాజు మాట్లాడుతూ వికలాంగులైన పిల్లలు అన్ని రంగాలలో ముందుకు వెళ్లాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న అన్ని రాయితీలు ఉపయోగించుకోవాలని సూచించారు.

పెనుమంట్ర : వికలాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఎంఇఒ-2 యు.నాగేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని ఆలమూరు భవిత వికలాంగుల పాఠశాలలో వేడుకలు జరిగాయి. భవిత పాఠశాల, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పెనుమంట్ర శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెనుమంట్ర మండల విద్యాశాఖ అధికారి యు.నాగేశ్వరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు, హై స్కూల్ హెడ్ మాస్టర్ జోగి రెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్య బాధితునికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న యూత్ సభ్యులు

కాళ్ల : దొడ్డనపూడి గ్రామానికి చెందిన అనారోగ్య బాధితుడు ఆరేటి మారియ్యకు వైద్య ఖర్చుల నిమిత్తం సర్పంచి కొల్లి సుబ్బారావు ఆర్థిక సాయం అందజేశారు. దొడ్డనపూడి గ్రామానికి చెందిన మారియ్య ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచి కొల్లి సుబ్బారావు మారియ్యను పరామర్శించారు. వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. మారియ్యకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సాయాన్ని సర్పంచి తరపున యూత్ సభ్యులు మంగళవారం అందజేశారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన

తణుకు : తణుకు పట్టణానికి పనుల నిమిత్తం వచ్చే పేద, బడుగు, మధ్యతరగతి ప్రజలకు ఎన్‌టిఆర్ అన్నా క్యాంటీన్ ద్వారా ఆకలి తీరుస్తుందని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం తణుకు పట్టణంలో సొసైటీ రోడ్డులో ఉన్న అన్నా క్యాంటీన్‌లో భోజన నాణ్యతను రాధాకృష్ణ పరిశీలించారు. అన్నా క్యాంటీన్‌లో పెడుతున్న భోజన వసతి సౌకర్యాల గురించి, భోజన లోటు పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ అన్నా క్యాంటిన్ ప్రారంభించిన నాటి నుంచి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం, మంచి వంటకంతో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కొనసాగుతుందన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం సానుభూతిపరుడు వెంకటేశ్వర్లు మృతి



యలమంచిలి : మండలంలోని కలగంపూడి గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతిపరుడు గూడూరు పెద్ద వెంకటేశ్వర్లు(70) అనారోగ్యంతో సోమవారం రాత్రి మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటేశ్వర్లు 1977-1980 మధ్య కాలంలో చించినాడ, కలగంపూడి గ్రామాల్లో అప్పటి కాంగ్రెస్ భూస్వాములు, వ్యవసాయ కార్మికులు, పేద రైతులకు మధ్య జరిగిన మహా పోరాటంలో పాల్గొన్నారు. భూస్వాములు, పోలీసు నిర్బంధం ఎదుర్కొన్నారు. వీరి భౌతికకాయానికి సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి నివాళులు అర్పించారు. మండల కమిటీ సభ్యులు గూడూరి ఆంజనేయులు, స్థానిక నాయకులు గుబ్బల చక్రపాణి, గుబ్బల సత్యనారాయణ, కడలి కుమారుస్వామి, పొత్తూరి నర్సింహారాజు నివాళులు అరిపించారు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు పెంచాలి : డిఎంహెచ్ఒ

గణపవరం: ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు పెంచే విధంగా ఆరోగ్య శాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డి.మహేశ్వరరావు వైద్య అధికారులకు సూచించారు. మంగళవారం గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆశా కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రెండేళ్ల పిల్లలకు అదనపు ఆహారం ఏవిధంగా ఇవ్వాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. ఎన్‌సిడి సర్వే ప్రతిరోజూ సచివాలయంలో చేయాలని అన్నారు. వైద్యాధికారులు స్థానిక హాస్పిటల్స్‌ను పరిశీలించి, అక్కడ ఉన్న విద్యార్థులకు కావలసిన మందులు ఇవ్వాలని అన్నారు. సచివాలయ పరిధిలోగల వాటర్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. ఇంటింటా సర్వేలో స్థానికులను కాచి చల్లారిన నీరు తాగాలని చెప్పాలని అన్నారు. చల్లారిన నీరు తాగటం వల్ల మలేరియా, డేంగీ వ్యాధులను అరికట్టవచ్చునని తెలిపారు. ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలు దరిచేరవని అన్నారు. పొడి వాతావరణం వల్ల దోమలు పుట్టవన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డాక్టర్లు పి.సంతోష్, పి.కిరణ్మయి, కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతకు 'టెక్ ఫెస్ట్' : కలెక్టర్

తాడేపల్లిగూడెం : విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయడానికి టెక్‌ఫెస్టులు ఉపయోగకరంగా ఉంటాయని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. మంగళవారం తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న పాలిటెక్ ఫెస్ట్ 2024ను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని(11), రెండు ప్రభుత్వ, 9 ప్రయివేట్ పాలిటెక్నిక్ కాలేజీలకి సంబంధించి 123 మంది విద్యార్థులు ఇసిఇ, ఇఇఇ, ఎఐఎమ్ఎల్, కంప్యూటర్, మెకానికల్, సివిల్ తదితర విభాగాల నుంచి 49 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. రెండు రోజులపాటు ఈ ప్రదర్శనలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఈ ప్రదర్శనను తిలకించడానికి వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు సందర్శించారన్నారు. వీరికి ఉచిత బస్సు సౌకర్యం, అల్పాహారాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులలో నుంచి ఉత్తమమైన 15 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయిలో జరుగు పాలిటెక్ ఫెస్ట్‌కి ఎంపిక చేయనున్నారు. ఈ ప్రదర్శనలో మొదటి స్థానంలో నిలిచిన ప్రాజెక్టుకు రూ.25 వేలు, రెండవ స్థానంలో నిలిచిన ప్రాజెక్టుకు రూ.10 వేలు బహుమతి ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కౌసర్ బానో, మున్సిపల్ కమిషనర్ ఎమ్.ఏసుబాబు పాల్గొన్నారు.

'మేధోసంపత్తికి పరిశోధనలే కొలమానం'

తాడేపల్లిగూడెం : ఆవిష్కర్తల మేధోసంపత్తికి వారి పరిశోధనలే కొలమానమని ఇవా ఐపి అండ్ ఐటి ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ మద్దిపాటి సూచించారు. ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ఆచార్యులు డాక్టర్ ఎన్‌వి.రమణారావు ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో మేధోసంపత్తి హక్కులు, ఆవిష్కర్తల పేటెంట్‌లు అనే అంశంపై అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి శ్రీనివాస్ మాట్లాడుతూ అవిష్కర్తలు సమాజానికి ఉపయోగపడేలా నాణ్యమైన పరిశోధనా ప్రాజెక్టులను చేపట్టాలన్నారు. ప్రతి అవిష్కర్త కేవలం పరిశోధనా పత్రాలకే పరిమితం కాకుండా తమ పరిశోధనలను పేటెంట్‌లుగా మలుచుకునే స్థాయికి ఎదగాలని సూచించారు. పేటెంట్ కోసం దరఖాస్తు ఎలా చేయాలి, దానివల్ల వ్యక్తిగతంగా కలిగే ప్రయోజనాలపై ఆవిష్కర్తల సందేహాలను శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆచార్యులు, అవిష్కర్తలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ఉండి : ఆలయాల వద్ద ఆయా ప్రతినిధులు తమ తమ ఆలయాల పరిరక్షణ బాధ్యత చూసుకోవడానికి ఆలయం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ మహమ్మద్ నశీరుల్లా అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం సాయంత్రం ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా అధ్యక్షతన గ్రామంలోని ఆలయాలు, చర్చి, మసీద్‌ల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మహమ్మద్ నశీరుల్లా మాట్లాడుతూ వాచ్‌మెన్ కూడా పెట్టుకోవడం వల్ల ఆలయానికి భద్రత ఏర్పడుతుందని, గతంలో ఆలయాలలో చోరీలు జరిగినప్పుడు ఆ ఆలయాల వద్ద అమర్చిన సీసీ కెమెరాల వల్ల చాకచక్యంగా దొంగలను పట్టుకోడం జరిగిందని తెలియజేశారు. పలు దేవాలయాల ప్రతినిధులు, సచివాలయ మహిళా కానిస్టేబుల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెనుమంట్ర : ఈనెల 4వ తేదీ బుధవారం మార్టేరు సబ్ స్టేషన్ పరిధిలో మార్టేరు, నెగ్గిపూడి, వెలగలేరు, సత్యవరం, కొయ్యేటిపాడు గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ నరసాపురం ఎఇ కె.మధుకుమార్ తెలిపారు. మార్టేరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రెయినేజీలో సిల్టు తొలగింపు

మొగల్తూరు: మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో ఉన్న మురుగు డ్రెయిన్ పూడికను పారిశుధ్య కార్మికులు మంగళవారం తొలగించారు. డ్రెయినేజీ పూడుకుపోయి మురిగునీరు రహదారిపై ప్రవహించడంతో ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో దుర్గంధం కూడా వెదజల్లుతుంది. పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

సత్యనారాయణకు సత్కారం

పాలకొల్లు : ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బిలాయ్‌లో ప్రవాసాంధ్ర ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి నాటికల పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన పాలకొల్లు కళా పరిషత్ వ్యవస్థాపకుడు మానాపురం సత్యనారాయణను సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. గత మూడు సంవత్సరాలుగా వరుసగా బిలాయిలో జరిగే నాటికల పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించినందుకు సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు ఎల్.రుద్రమూర్తి, కార్యదర్శి కె.శ్రీనివాస్, సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.

మాంటిస్సోరీస్ విద్యార్థినికి జ్ఞాన జ్యోతి అవార్డు

పాలకొల్లు రూరల్: శ్రీ వాగ్దేవి విద్యా సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థ బాసర వారు సోమవారం నిర్వహించిన శ్రీజ్ఞాన సరస్వతికి నృత్య అర్చన కార్యక్రమంలో పాలకొల్లు మండలం ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ స్కూల్ విద్యార్థిని మాడుగుల కార్తీక తులసి పాల్గొన్నారు. కార్తీక నృత్య ప్రావీణ్యంకు మెచ్చి శ్రీవాగ్దేవి విద్యా సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థ బాసర వారు కార్తీకకు నృత్య జ్ఞాన జ్యోతి అవార్డును ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాంటిస్సోరీస్ విద్యా సంస్థల డైరెక్టర్ అండ్ అడ్మినిస్ట్రేటర్ మద్దాల వాసు కార్తీకను ప్రత్యేకంగా అభినందించారు. స్కూల్ సెక్రెటరీ, కరస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్, ప్రిన్సిపల్ సామవేదం వసంత లక్ష్మీ విద్యార్థిని అభినందించారు.